సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం ၊ 29 ၊ డిసెంబర్ ၊ 2022



ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు 8లో



ఎత్తిపోతల పథకం సర్వే పనుల పరిశీలన 8లో

విజృంభిస్తున్న చలిగాలులు 8లో



న్యూస్‌రీల్

పొగరాని పొయ్యిల పంపిణీ



పంపిణీ చేస్తున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, సబ్ కలెక్టర్ అభిషేక్

పాడేరు రూరల్: పొగరాని పొయ్యిల వాడకం వల్ల వంట చెరకు వినియోగం తగ్గి 80శాతం పొగను అరికట్టడం జరుగుతుందని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, పాడేరు సబ్ కలెక్టర్ వి.అభిషేక్ అన్నారు. క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మోదకొండమ్మతల్లి ఆడిటోరియంలో మహిళలకు పొగరాని పొయ్యిల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో క్రాప్ జోన్ ఎండీ సాయిబాబా, పాడేరు ఎంపీపీ రత్న కుమారి, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, మాజీ ఎంపీపీ ఎస్వీ రమణమూర్తి పాల్గొన్నారు.

లంబసింగిలో రెండు రోజుల ఫుడ్ ఫెస్టివల్

చింతపల్లి: ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో రెండు రోజుల పాటు సంప్రదాయ వంటలతో పర్యాటకులను ఆకట్టుకునేలా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు హరితా హిల్ కో ఆర్డినేటర్ అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల 31, వచ్చే నెల ఒకటో తేదిన పర్యాటకుల కోసం హరిత హిల్స్ రిసార్ట్స్‌లో వివిధ రకాల శాఖాహార, మాంసాహార వంటకాలు తయారు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం

ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

చింతూరు: స్పందనలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ వచ్చిన అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని, సమస్యల పరిష్కారంపై అర్జీదారులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. వివిధ సమస్యలకు సంబంధించి 22 అర్జీలు స్వీకరించినట్టు ఆయన తెలిపారు.

పేద మహిళ వైద్యానికి రూ.3లక్షలు

- సీఎం సహాయనిధి నుంచి కేటాయింపు
- మంజూరు పత్రం అందజేసిన ఎమ్మెల్యే ధనలక్ష్మి



బాధితురాలు అక్కమ్మకు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

వీఆర్‌పురం: అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబానికి చెందిన మహిళకు వైద్య నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.3 లక్షలు మంజూరయ్యాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. బుధవారం చింతరేవుపల్లి గ్రామంలో పర్యటించిన ఆమె బాధితురాలికి మంజూరు పత్రాన్ని అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చింతరేవుపల్లి గ్రామానికి చెందిన ముత్యాల అక్కమ్మ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతోందని చెప్పారు. ఆపరేషన్‌కు రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుందన్నారు. దీంతో రూ.3 లక్షలు మంజూరయ్యాయని ఆమె పేర్కొన్నారు.

రవాణాశాఖ పోర్టల్‌పై అవగాహన

చింతూరు: వచ్చే ఏడాది జనవరి నుంచి రవాణాశాఖ ఆన్‌లైన్ పోర్టల్ మారనున్నట్టు చింతూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పులి ఆనందరావు బుధవారం తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్ర రవాణా శాఖ సర్వీసుల కోసం వినియోగిస్తున్న ఏపీఆర్టీఏ సిటిజన్ పోర్టర్ సేవలను ఇకపై మినిస్ట్రీ ఆఫ్ రోడ్స్ అండ్ హైవేస్ పరివాహన్‌కు బదిలీ చేయనున్నట్టు తెలిపారు.

10 రోడ్లు.. రూ.31.92 కోట్లు



అభివృద్ధి చెందిన పాడేరు ఘాట్‌రోడ్డు

- పూర్తిస్థాయిలో అభివృద్ధి
- అద్దంలా మెరిసిపోతున్న రహదారులు
- వాహన చోదకులకు తప్పిన అవస్థలు
- ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం



అభివృద్ధి చేసిన మారేడుమిల్లి-భద్రాచలం రోడ్డు



ఆకర్షణీయంగా అరకులోయ-అనంతగిరి రోడ్డు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని ఘాట్‌రోడ్లు, ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్లను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రోడ్లను రాష్ట్ర హైవేలుగా ప్రభుత్వం గుర్తించింది. వీటిని పూర్తిస్థాయిలో తారు రోడ్లగా అభివృద్ధి చేసేందుకు రూ.31.92 కోట్లు వెచ్చించింది. వీటితో రోడ్లన్నంటిని అందంగా తీర్చిదిద్దారు.

సాఫీగా ప్రయాణం

పాడేరు, లంబసింగి, కొక్కిరాపల్లి, అనంతగిరి, మారేడుమిల్లి–భద్రాచలం, గూడెంకొత్తవీధి, చెరుకుంపాకలు–కిన్నెర్ల తదితర ప్రధాన ఘాట్ రోడ్లు అభివృద్ధి చేయడంతో ప్రయాణం సాఫీగా సాగిపోతోంది. వాహనాలు రయ్‌రయ్ మంటూ పరుగులు తీస్తున్నాయి.

నాణ్యతకు ప్రాధాన్యం

రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రాధాన్యమిచ్చి దగ్గరుండి పనులు జరిపించారు. వాహనాల రాకపోకలకు అనువుగా ఘాట్ రోడ్లు అభివృద్ధి చెందడంతో వాహన చోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అద్దంలా మెరుస్తున్న రోడ్లలో పర్యాటకులు తమ వాహనాల స్పీడ్‌ను కూడా పెంచారు. గిరిజన ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని ప్రధాన రోడ్ల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడంపై అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

రోడ్ల వివరాలు	పొడవు (కి.మీ)	నిధులు
మారేడుమిల్లి-భద్రాచలం	14.8	రూ.8.43 కోట్లు
జి.మాడుగుల-చినబందవీధి	14.8	రూ.4.75 కోట్లు
పాడేరు ఘాట్‌రోడ్డు	8.38	రూ.2.82 కోట్లు
డౌనూరు,గరికిబంద ప్యాకేజీ	6.85	రూ.2.66 కోట్లు
నర్సీపట్నం-జి.కే.వీధి	6.4	రూ.2.85 కోట్లు
అన్నవరం-చెరుకుంపాకలు	8	రూ.2.58 కోట్లు
చెరుకుంపాకలు-కిన్నెర్ల	7.8	రూ.2.75 కోట్లు
అరకు-అనంతగిరి	1.3	రూ.54 లక్షలు
ధారకొండ - సీలేరు	4.4	రూ.1.88 కోట్లు
పాడేరు-ముంచంగిపుట్టు	7.8	రూ.2.66 కోట్లు

పూర్తిస్థాయి పర్యవేక్షణ



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణలో రోడ్ల అభివృద్ధి పనులను చేపట్టాం. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంపై పర్యాటకులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్త జిల్లాగా ఆవిర్భవించిన నేపథ్యంలో మన్యంలో రోడ్లు సౌకర్యవంతంగా మారాయి. సీలేరు–దారకొండ పనులు కూడా త్వరితగతిన పూర్తిచేస్తాం.

–బాలసుందరబాబు, ఇన్‌చార్జి పర్యవేక్షక ఇంజనీరు, ఆర్‌అండ్‌బీ, పాడేరు

గిరిజన సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకట్రావు



మాట్లాడుతున్న పార్టీ పరిశీలకుడు చొక్కాకుల వెంకట్రావు, చిత్రంలో అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

కొయ్యూరు: గిరిజన సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడిఉందని వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకట్రావు అన్నారు. రాజేంద్రపాలెంలో బుధవారం సచివాలయ కన్వీనర్లు, పార్టీ రథసారధులు, వలంటీర్లతో పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లతో పాటు సచివాలయ ఉద్యోగాలను పూర్తిగా గిరిజన అభ్యర్థులకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. పాడేరులో వైద్య కళాశాల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. దీని మూలంగా ప్రత్యేక వైద్య నిపుణులు వస్తారని పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యతలు కార్యకర్తలపై ఉందన్నారు. ఇప్పటివరకు అందించిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. నాటి ప్రభుత్వానికి నేటి ప్రభుత్వానికి మధ్య తేడాను కన్వీనర్లు ప్రజలకు తెలియజేయాలని కోరారు.

నవరత్నాలతో ప్రతీ కుటుంబానికి మేలు: అరకు ఎంపీ మాధవి

నవరత్నాలతో ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం మేలు చేసిందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు చేయూత పథకం వరంగా మారిందన్నారు. జగనన్నను రెండోసారి సీఎంగా చేసేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కన్వీనర్లు, గృహరథసారధులు కష్టించి పనిచేయాలని కోరారు.

అనుసంధానకర్తలు మీరే: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

సచివాలయ పరిధిలో నియమించిన ముగ్గురు కన్వీనర్లు, 50 గృహాలకు ఇద్దరు చొప్పున గృహరథ సారధులు పార్టీకి రెండు కళ్ల లాంటి వారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. పార్టీకి ప్రజలకు మధ్య సమన్వయకర్తల మాదిరిగా పనిచేయాలని కోరారు. పార్టీ బాధ్యత వారిపై పెట్టిందన్నారు. పింఛన్లు తొలగిస్తున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. టీడీపీ హయాంలో 32 లక్షల మందికి పింఛన్లు ఇస్తే ఇప్పుడు 60 లక్షలు దాటి పింఛన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. పింఛను కావాలంటే ఒకప్పుడు ఎవరు చనిపోతారా అని ఎదురు చూడాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు అర్హులైతే వెంటనే వస్తుందన్నారు. ఇంటికే తీసుకెళ్లి పింఛన్ ఇవ్వడం వల్ల అవ్వతాతలకు కష్టాలు తప్పాయన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, సీనియర్ నేత గాడి సత్యనారాయణ, చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అప్పన గజ్జయ్యదొర,ఆ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే నివృత్తి చేసుకోవాలి

ఎస్‌డీసీ స్వామినాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డీసీ స్వామినాయుడు

కూనవరం: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు భూములకు సంబంధించి ప్రభుత్వం ప్రచురించిన నోటిఫికేషన్‌లో అభ్యంతరాలు ఉంటే గ్రామ సభలో దరఖాస్తు ద్వారా నివృత్తి చేసుకోవాలని పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్ట్ స్వామినాయుడు సూచించారు. మండల పరిధిలోని తురకలగూడెం భూములకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణకు ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించిన అన్ని ఆధారాలు సక్రమంగా ఉన్నాయా లేదో పరిశీలించుకోవాలని, చేర్పుమార్పులు చేసుకునేవి సరిచేసుకోవాలని సూచించారు. యజమాని మరణిస్తే అతని భార్య, లేదా భర్తపేరుతో మరణ ధ్రువీకరణ పత్రం పొందాలని, ఇద్దరూ మరణించినట్లు అయితే కుటుంబ వారస్వ ధ్రువీకరణ పత్రం పొందిన అనంతరం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేరు, ఇంటి పేరు, సర్వేనంబర్లు తదితర అంశాల్లో పొరపాట్లు దొర్లినట్లు అయితే గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్పంచ్ కారం పార్వతి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎంపీపీ పాయం రంగమ్మ, వీఆర్‌ఏ జెట్టి రామకృష్ణ, పోలవరం సిబ్బంది, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ



షటిల్ బ్యాట్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో విజేత మణికంఠ (దిగువ వరుసలో రెండో విద్యార్థి)

జి.మాడుగుల: కడప జిల్లా పొద్దుటూరులో ఈనెల 22 నుంచి 24వరకు జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో స్థానిక గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థి రీమెలి మణికంఠ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించాడు. స్థానిక గురుకుల బాలుర కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.మణికంఠ రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించడంపై ప్రిన్సిపాల్ పారయ్య, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణారావు, పీడీ దున్ను అధ్యాపకులు అభినందించారు.

అనారోగ్యంతో ఆశ్రమ విద్యార్థి మృతి

న్యాయం చేయాలని జిల్లా ఆస్పత్రి, ఐటీడీఏ ఎదుట ఆందోళన



విద్యార్థి ధోనీ (ఫైల్)



జిల్లా ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు

పాడేరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి చెందాడు. దీంతో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఆస్పత్రి, ఐటీడీఏ ఎదుట కుటుంబ సభ్యులు, విద్యార్థి, ప్రజాసంఘాలు ఆందోళన చేశాయి. స్థానిక తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్.ధోనీ(13) అనే విద్యార్థికి ఈనెల 27 రాత్రి వాంతులు, విరోచనాలు అయ్యాయి. బుధవారం ఉదయం వరకు తగ్గకపోవడంతో అతడిని పాఠశాల సిబ్బంది ద్విచక్ర వాహనంపై పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా విద్యార్థి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఇలావుండగా మృతి చెందిన విద్యార్థి ధోనీ కుటుంబానికి ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కుటుంబ సభ్యులు, విద్యార్థి, ప్రజా, గిరిజన సంఘాల నాయకులు జిల్లా ఆస్పత్రి, ఐటీడీఏ ఎదుట ఆందోళన చేపట్టారు. విద్యార్థి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమని వారు ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి పరిహారం కింద రూ.2 లక్షలు ఇచ్చేందుకు పాఠశాల యాజమాన్యం అంగీకరించింది. అయితే విద్యార్థి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. దీంతో తాము రూ.లక్ష మాత్రమే ఇస్తామని పాఠశాల సిబ్బంది చెప్పడంతో కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. రాత్రి వరకు ఈ ఆందోళన కొనసాగింది.పాడేరు సీఐ సుధాకర్, పోలీసులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

గిరి విద్యార్థుల్లో అపార ప్రతిభ

- గుణాత్మక విద్య అందిస్తే మరింత రాణింపు
- గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే
- పాడేరులో గిరి విజ్ఞాన సంబరాలు ప్రారంభం



సమూనాలను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే



థింసా నృత్యం చేస్తున్న గిరిజన విద్యార్థినులు



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే

సాక్షి,పాడేరు: గిరి విద్యార్థుల్లో విజ్ఞాన ప్రతిభకు కొదవలేదని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే కొనియాడారు.స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాలయాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన గిరి విజ్ఞాన సంబరాలను బుధవారం సాయంత్రం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఉపాధ్యాయులంతా గిరిపుత్రులకు ప్రేమతో గుణాత్మక విద్యను బోధిస్తే అన్ని రంగాల్లోను ప్రతిభావంతులు అవుతారన్నారు. గిరిజన విద్యార్థుల్లో విజ్ఞానం, సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికితీయాలన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో గిరి విజ్ఞాన సంబరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని, రాష్ట్ర స్థాయిలోను నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, గోరుముద్ద తదితర కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు.బైజూస్‌తో ఒప్పందం చేసుకుని పర్సునల్ విధానంలో ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఐటీడీఏ పరిధిలో గిరిజన విద్యాభివృద్ధితో ఉన్నత విద్యకు అందిస్తున్న సేవలను సమగ్రంగా వివరించారు. సుమారు లక్షమంది విద్యానేకథలే చదువుకుంటున్నారని, గతేడాది 50మందికి ఐఐటీలో శిక్షణ అందిస్తే 22 మంది సీట్లు సాధించారన్నారు. నీట్,లాసెట్‌లోను గిరిజన విద్యార్థులు రాణించారని, ఇటీవల శ్రీహరికోట విజ్ఞాన యాత్రకు 130 మంది విద్యార్థులను పంపామని ఆయన తెలిపారు. గుత్తులపుట్టు, శ్రీకృష్ణాపురం బాలికల నృత్యప్రదర్శనలు, కొయ్యూరు విద్యార్థులు మలకంబ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

122 విద్యాలయాలు.. 577 విజ్ఞాన ప్రాజెక్టులు

ఐటీడీఏ పరిధిలోని 122 గిరిజన విద్యాలయాలకు చెందిన 1100 మంది గిరిజన విద్యార్థులు అన్ని విభాగాల్లో రూపొందించిన 577 విజ్ఞాన ప్రాజెక్టులను గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే,కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. ఆయా విద్యార్థుల ప్రతిభను అభినందించారు. రాత్రి వరకు వాటిని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, గిరిజన విద్యార్థులతో వారు మమేకం అయ్యారు. కుస్తీ పోటీలను వారు ప్రారంభించారు. అలాగే థింసా నృత్యాలతో సందడి చేశారు. డప్పు వాయిద్యాలు హోరెత్తాయి.ఈనెల 30 వరకు మూడు రోజుల పాటు గిరిజన విజ్ఞాన సంబరాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్,డీఈవో డాక్టర్ రమేష్,డీడీ కొండలరావు,అన్ని మండలాల ఏటీడబ్ల్యూవోలు,హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభం

పాడేరు రూరల్: ఐటీడీఏలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంతిలాల్‌దండే, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ స్థానిక గిరిజన గురుకుల బాలికల కళాశాల, జి.మాడుగుల గిరిజన గురుకుల బాలుర కళాశాల విద్యార్థులతో వర్చువల్ విధానంలో మాట్లాడారు. కళాశాలలో మెనూ, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. భోజనాలు సక్రమంగా పెడుతున్నారా లేదా , ఫిర్యాదుల పెట్టె ఉందా ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. బాలికల గురుకుల కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి కలెక్టర్ నిధులు మంజూరు చేశారని, ప్రహరీ నిర్మాణానికి ఐటీడీఏ పీవో నిధులు మంజూరు చేశారని విద్యార్థులు వివరించారు. గ్రామ సచివాలయం మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు వస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్‌రావు, టీడబ్ల్యూ ఈఈ డీవీఆర్‌ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న కాంతిలాల్ దండే

వన్‌ధన్ మార్ట్ ప్రారంభం

సాక్షి, పాడేరు: గిరిజన వ్యవసాయ,అటవీ ఉత్పత్తులను అన్ని వర్గాల ప్రజలకు అమ్మకాలు జరిపే విధంగా వెలుగుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన్‌ధన్ మార్ట్‌ను గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే,కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పివో గోపాలకృష్ణ,సబ్‌కలెక్టర్ అభిషేక్‌లు బుధవారం రాత్రి ప్రారంభించారు,సుండ్రుపుట్టు వెలుగు కార్యాలయాన్ని ఆనుకొని అన్ని సౌకర్యాలతో కూడిన మార్ట్‌ను ఐటీడీఏ నిర్మించింది.పాడేరు ఐటీడీఏ పరిధిలోని అనేక గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాల మహిళలు వన్‌ధన్ ప్రాజెక్టులో తయారు చేసిన అన్ని ఉత్పత్తులను వారు పరిశీలించారు.



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే



కొయ్యూరు విద్యార్థులు ప్రదర్శించిన మల్ల విద్య

ఉత్తమ ప్రమాణాలతో మెరుగైన విద్య



విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లతో ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పరిశీలకుడు చొక్కాకుల వెంకట్రావు



వీఆర్ పురంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కొయ్యూరు: విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యమని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని, ఉత్తమ ప్రమాణాలతో మెరుగైన విద్య అందిస్తోందన్నారు. రాజేంద్రపాలెం బాలికల పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నాడు–నేడు ద్వారా కోట్లాది రూపాయలతో సర్కారు బడులను అభివృద్ధి చేస్తున్నారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పద్ధతిలో బోధన జరుగుతోందన్నారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు బాబులు, మండల పార్టీ ఉపాధ్యక్షులు వెంకటరమణ, నూకాలు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, సీనియర్ నేత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

వీఆర్ పురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. వీఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 8 వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకోవాలన్న ఉద్దేశంతో బైజ్యూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందజేయడం హర్షణీయమన్నారు. దీంతో నాణ్యమైన విద్య అందుతోందని, ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్టీ కమీషన్ సభ్యుడు చిచ్చడి మురళి, తహసీల్దార్ ఎస్.శ్రీధర్, ఎంపీడీవో ఫణిదర్, ఎంఈఓ వి.వి.లక్ష్మీ నారాయణ, ఎంపీపీ కారం లక్ష్మి, వైస్ ఎంపీపీ ముత్యాల భవాని, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి ,సర్పంచ్‌లు నరసమ్మ, రామారావు, మూట్ల బాలరాజు, వడ్డానపు శారద,పులి సంతోష్, ఎంపీటీసీ సభ్యుడు పూనెం ప్రదీప్,కూనవరం ఎంపీపీ పాయం రంగమ్మ,జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ, ఎస్ఎంసీ చైర్మెన్ ముత్యాల రాంబాబు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

- పురుషుల విభాగంలో విశాఖపట్నం, మహిళా విభాగంలో కృష్ణా జట్టు విజేతలు
- క్రీడాకారులను అభినందించిన అరకు ఎంపీ మాధవి



పోటీలకు సహకారం అందించిన శివప్రసాద్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఎంపీ మాధవి

కొయ్యూరు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మారుమూల గ్రామం శరభన్నపాలెం మొదటిసారి వేదిక కావడం ఆనందంగా ఉందని అరకు ఎంపీ మాధవి అన్నారు. శరభన్నపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 26 నుంచి ప్రారంభమైన అండర్ 19 విభాగం రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. రాష్ట్రంలోని 13 (పాత) జిల్లాల నుంచి 13 చొప్పున పురుషులు, మహిళల జట్లు పాల్గొన్నాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడారు. జాతీయ స్థాయిలో కూడా మహిళలు రాణించాలని కోరారు. జాతీయ స్థాయి పోటీలకు పురుషులు, మహిళా విభాగంలో 20 మంది చొప్పున 40 మంది ఎంపికయ్యారు.

విజేతలకు అభినందన

పురుషుల విభాగంలో మొదటి స్థానంలో విశాఖపట్నం, ద్వితీయ స్థానం ప్రకాశం, తృతీయస్థానంలో తూర్పుగోదావరి జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో మొదటిస్థానంలో కృష్ణా జిల్లా, ద్వితీయ స్థానంలో గుంటూరు, తృతీయస్థానంలో విశాఖపట్నం జట్లు నిలిచాయి. విజేతలను ఎంపీ మాధవి అభినందించారు. ఆమె చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందించింది. ఆ సంస్థ వ్యవస్థాపకుడు కె శివప్రసాద్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమన్వయకర్త ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాంబాబు, సహాయ రాష్ట్ర కార్యదర్శులు సుధాకర్, రమణ, కోశాధికారి పుష్పలత, సర్పంచ్ కిముడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ పరిశీలన



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

పాడేరు రూరల్: కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ సిద్ధంగా ఉందని జిల్లాలో 10వేల రాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా అన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిని ఆయన బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్లను పరిశీలించారు. ఆక్సిజన్ నిల్వలు, వెంటిలేటర్లు, బెడ్లు పుష్కలంగా ఉన్నట్టు చెప్పారు. అనంతరం ఆస్పత్రిలోని పునరావస కేంద్రాన్ని తనిఖీ చేశారు. తల్లులు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఆయన వెంట డీసీహెచ్ డాక్టర్ శంకర్‌ప్రసాద్, తదితరులున్నారు.

గంజాయి తోటలు ధ్వంసం



గంజాయి తోటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

డుంబ్రిగుడ: మండలంలోని తడ, సరియవలస గ్రామాల్లో గంజాయి తోటలను పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలోని పోలీస్ సిబ్బంది గ్రామాలకు బుధవారం వెళ్లి, గంజాయి తోటలను ధ్వంసం చేశారు. అనంతరం గ్రామంలోని గిరిజనులకు అవగాహన కల్పించారు. కాఫీ, మిరియాలు, మామిడి, జీడి తదితర తోటలను వేసుకుని ఆర్థికంగా ఎదగాలని, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోని హెచ్‌సీ బుద్ధ, అర్కే, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక చర్యలు

రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణ



రోడ్ల నిర్మాణంపై ఆర్డీసీ చైర్మన్ సుబ్బరాజుకు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణ

అడ్డతీగల: జిల్లాలో ముఖ్యమైన రహదారుల పునర్నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జనరల్ బాడీ సమావేశంలో కోరామని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ చెప్పారు. విజయవాడలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సమావేశం చైర్మన్ కనుమూరి సుబ్బరాజు అధ్యక్షతన బుధవారం జరిగిందన్నారు.ఈ సందర్భంగా సమావేశంలో అల్లూరి జిల్లాలోని పలు రహదారుల మరమ్మతులు, నిర్మాణాలపై చర్చించినట్టు తెలిపారు. ఈ మేరకు ఆయా వివరాలను ఆయన 'సాక్షి'కి వెల్లడించారు.అల్లూరి జిల్లాలోని మారేడుమిల్లి నుంచి చింతూరు, చెరుకుంపాలెం–జెడ్డంగి, జెడ్డంగి–గొంటువానిపాలెం, దూసరిపాము–బోయపాడు తదితర రహదారుల పునర్నిర్మాణం అవశ్యకతను కార్పొరేషన్ చైర్మన్ సుబ్బరాజుతో పాటు ప్రిన్సిపాల్ కార్యదర్శి ప్రద్యుమ్న, ఎండీ శ్రీనివాసరెడ్డి, ఇంజినీర్ ఇన్ చీఫ్ నదీముల్లా దృష్టికి లిఖితపూర్వకంగా తెలియజేశామన్నారు. ఆయా రహదారుల్లో మరమ్మతులు, అవసరమైన చోట నిర్మాణాలపై కార్యాచరణ చేయనున్నట్టు తెలిపారు.

మేలైన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్‌బాబు

సాక్షి, విశాఖపట్నం: మేలైన వ్యవసాయ పద్ధతులపై ఉత్తరాంధ్ర జిల్లాల రైతులు, వ్యవసాయశాఖ అధికారులకు బుధవారం విశాఖలోని ఓ హోటల్లో శిక్షణ, అవగాహన సదస్సు జరిగింది. అగ్రికల్చరల్, ప్రాసెస్డ్ ఫుడ్ ప్రోడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్) ఎండీ శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మేలైన వ్యవసాయ పద్ధతులను పాటించి సాగు చేయడం వల్ల నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని, దీంతో రైతులకు మంచి ధర లభిస్తుందని చెప్పారు. చిరుధాన్యాల సాగుపై వ్యవసాయ శాఖ గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ బాలూ నాయక్, ఉద్యానశాఖ అధికారి ధర్మారావు వివరించారు. సదస్సులో రైతులతో పాటు పలువురు బ్రీడర్లు కూడా పాల్గొన్నారు. మంచి వ్యవసాయ పద్ధతులు పాటించిన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సుకు విశాఖ జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ అధికారులు హాజరయ్యారు.

హత్యకేసులో ఇద్దరు అరెస్ట్



కేసు వివరాలను వెల్లడిస్తున్న అరకు సీఐ దేముడుబాబు, అనంతగిరి ఎస్ఐ రాము

అనంతగిరి: హత్యకేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు అరకు సీఐ దేముడుబాబు తెలిపారు. అరకువేలి మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద అనంతగిరి ఎస్ఐ రాముతో కలిసి, సీఐ దేముడుబాబు కేసు వివరాలను బుధవారం వెల్లడించారు. అనంతగిరి మండలంలోని రొంపల్లి పంచాయతీ పసిని గ్రామానికి చెందిన జన్ని గంగులను, ఈనెల 26న మర్రివలస గ్రామానికి చెందిన దమ్మి సోములు, అతని బావమరిది ఎర్రబోయిన రమేష్‌తో కలిసి హత్యచేశారు. దమ్మి సోములు భార్యతో జన్ని గంగులుకు వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో సోములు గంగులుపై కక్ష పెంచుకున్నాడు. కూలిపనులు నిమిత్తం బయటకు వెళ్లి గ్రామానికి వస్తున్న గంగులును అడ్డగించి, మెడపై తువ్వాలు చుట్టి, సోములు, అతని బావమరిది రమేష్ హత్యచేశారు. గంగులు తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, నిందితులను అరెస్ట్ చేశామని సీఐ దేముడుబాబు తెలిపారు. నిందితులను రిమాండ్ తరలించినట్టుగా తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



అప్పారావు మృతదేహం

ఎస్.రాయవరం: పాముకాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి సోదరుడు పులి శేషారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రసాదరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పరాపల్లి గ్రామానికి చెందిన పులి అప్పారావు బుధవారం సాయంత్రం పొలంలో వరికుప్ప వేస్తుండగా కాలుపై పాము కాటువేసింది. కొద్దిసేపటికి నురగలు కక్కుతూ అతను కింద పడిపోవడంతో అక్కడే ఉన్న సోదరుడు పులి శేషారావు పాముకాటుకు గురైన అప్పారావును నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. అయితే పరిస్థితి విషమించి అప్పారావు మృతి చెందాడు.

అంతర్జాతీయ సదస్సుకు చింతపల్లి శాస్త్రవేత్త

చింతపల్లి: వచ్చే ఏడాది జపాన్‌లోని అయ్యవమా గకిన్ విశ్వవిద్యాలయం టోక్యోలో జరిగే ఆర్థిక శాస్త్రవేత్తల అంతర్జాతీయ సదస్సుకు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌కు ఆహ్వానం అందిందని ఏడీఆర్ సురేష్‌కుమార్ తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 17 నుంచి 20 వరకు ఈ సదస్సు జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లాలోని ఉన్నత పర్వత శ్రేణి ప్రాంతాల్లో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసి వివిధ రకాల పంటల్లో సాధించిన విజయాలు, ప్రస్తుతం పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న వివిధ రకాల పూలు వాటి ఫలితాలపై సదస్సులో ఆయన వివరించనున్నట్లు ఏడీఆర్ తెలిపారు. అంతర్జాతీయ సదస్సుకు స్థానిక శాస్త్రవేత్త ఎంపిక కావడంపై పలువురు శాస్త్రవేత్తలు అభినందనలు తెలిపారు.

సీతంపేటకు బదిలీ

చింతపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సీతారామ్‌కు సీతంపేట వ్యవసాయ పరిశోధన స్థానానికి బదిలీ అయినట్లు ఏడీఆర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

ఎత్తిపోతల పథకం సర్వే పనుల పరిశీలన

సీలేరు: సీలేరు జలవిద్యుత్ కేంద్రం నుంచి ఉత్పత్తి అనంతరం విడుదల అవుతున్న నీటిని పంప్‌డ్ స్టోరేజ్ ద్వారా తిరిగి సీలేరు రిజర్వాయర్‌లోకి మళ్లించనున్నట్టు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ (సివిల్) శేషారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన డొంకరాయి పవర్ కెనాల్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్గం మధ్యలో మరో విద్యుత్ కేంద్రాన్ని నిర్మించి విద్యుత్ ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా ఎత్తిపోతల పథకం పనులు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ సర్వే పనులు 90 శాతం పూర్తయ్యాయని చెప్పారు. సీలేరు సమీపంలోని పార్వతీనగర్ 1350 మెగావాట్ల విద్యుత్ కేంద్రానికి సంబంధించి కూడా ప్రజాభిప్రాయసేకరణ, 90 శాతం సర్వే పూర్తయిందన్నారు. ఇంకా అటవీశాఖ అనుమతులు రావలసి ఉందన్నారు. ప్రాజెక్టు పనులకు సంబంధించి టెండర్లు పిలవడానికి ప్రభుత్వ కూడా సిద్ధంగా ఉందన్నారు. ఇటీవల మంత్రివర్గం దీనికి ఆమోదం తెలిపిందన్నారు. అలాగే మోతుగూడెం 5,6 యూనిట్ల శాశ్వత నిర్మాణానికి సంబంధించి పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. యూనిట్ల నిర్మాణానికి పరికరాలు కూడా తీసుకురావడం జరుగుతుందన్నారు. పవర్ కెనాల్ పనులు మరో ఐదు రోజుల్లో పూర్తవుతాయన్నారు. ఆయన వెంట ఎస్ఈ ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

విజృంభిస్తున్న చలిగాలులు

దట్టంగా పొగమంచు

సాక్షి,పాడేరు: జిల్లాలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. చలిగాలులు విజృంభిస్తున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. వాహన చోదకులు లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు. ఘాట్‌రోడ్లలో మంచు తెరలు కమ్మేస్తున్నాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 12 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 14.1డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 16.4డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

టైరుబండిపై తరలిస్తున్న గడ్డి దగ్ధం

- కరెంటు తీగలు తగిలి ప్రమాదం
- బాధిత కుటుంబానికి డిప్యూటీ సీఎం నగదు సాయం



బాధిత రైతు ఈశ్వరరావుకు నగదు అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: దాలివలస గ్రామానికి చెందిన రైతు ఆరిపాక ఈశ్వరరావు బుధవారం కింతాడ గ్రామం నుండి గడ్డిని కొనుగోలు చేసి టైరు బండితో తరలిస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తగలడంతో మంటల్లో గడ్డి కాలిపోయింది. ఎత్తుగా గడ్డిని టైరు బండికి కట్టడంతో సమీపంలో గల వైర్లను గడ్డి తాకడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధిత రైతుకు కలిగిన నష్టాన్ని దాలివలస సర్పంచ్ భూమిరెడ్డి దేముళ్ళు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో బాధిత రైతును ఓదార్చిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తన సొంత నగదు రూ.3వేలను అతనికి అందించారు.